

నల్లగొండ ప్రకాశం బజార్‌లో విత్తనాల దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ హరిచందన

# నకిలీ విత్తనాలు అమ్మితే డయల్ 7288800023

- జిల్లాలో సరిపడా విత్తనాలు.. రైతులు ఆందోళన చెందొద్దు
- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- విలేకరుల సమావేశంలో కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, మే 31 : జిల్లాలో ఈ వానకాలం పంటకు సంబంధించి విత్తన నిల్వలు సరిపడా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వ్యవసాయ అధికారులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఎటువంటి కొరత లేదని అన్నారు. జిల్లాలో లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే ప్యాకేజీలో ఉన్న విత్తనాలు కొనుగోలు చేయాలని, ఒకవేళ విడి విత్తనాలు అమ్ముతున్నట్లు దృష్టికి వస్తే అధికారులకు తెలియజేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు వస్తే వెంటనే స్పందించేందుకు ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే 7288800023 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి, నకిలీ విత్తనాలు అమ్మే వారిపై చర్యలు తీసుకోవడానికి క్షేత్రస్థాయిలో పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో కూడిన టీమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే తమ టీమ్స్ ద్వారా మిర్యాలగూడ, శాలిగౌరారం మండలాల్లో నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి విత్తనాలను సీజ్ చేశామని తెలిపారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ విత్తన నిల్వలు ఉన్నాయని, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో 941 అవుట్‌లెట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు ఈ అవుట్‌లెట్ల ద్వారా మాత్రమే కొనాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలు 30 కిలోలు రూ.1116, పిల్లి పెసర 40 కిలోలు రూ.1,084, పత్తి విత్తనాలు 475 గ్రాములు రూ.864 అమ్ముతున్నట్లు కలెక్టర్ తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలపై 65శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, సమాచార శాఖ సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### పలు విత్తన దుకాణాలను తనిఖీ చేసిన కలెక్టర్

రైతులకు విత్తనాలు అందుబాటులో లేవని వార్తలు వస్తున్న నేపథ్యంలో కలెక్టర్ దాసరి హరిచందన శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్, దేవరకొండ రోడ్‌లో పలు విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమైన విత్తనాలు ఉన్నాయా లేవా? ఎలాంటి విత్తనాలు విక్రయాలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పత్తి విత్తనాలు ఏయే కంపెనీలు వాడుతున్నారని, లూజ్ విత్తనాలు కొనుగోలు చేస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు అడిగిన విత్తనాలను అందించాలని డీలర్లకు ఆమె సూచించారు. కలెక్టర్ వెంట వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



నల్లగొండ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్

# క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్

నీలగిరి, మే 31 : జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి.రవీందర్‌నాయక్ సూచించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం ప్రోగ్రామ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి వారంలో ఒక్కసారైనా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. దీని ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రబలుతున్న వ్యాధులను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టేందుకు వీలుంటుదని తెలిపారు. వచ్చేది వానకాలం సీజన్ కావడం వల్ల వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉన్నందున ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దోమల వ్యాప్తి అరికట్టడం ద్వారా డెంగ్యూ, మలేరియా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. విధుల పట్ల అధికారులు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ కళ్యాణచక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వేణుగోపాల్ రెడ్డి, కేశ రవి, పీఓడీటీ గీతవాణి, అరుంధతి, పద్మ, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి రుద్రాక్షి దుర్గయ్య పాల్గొన్నారు.

### చిట్యాల పీహెచ్‌సీ పరిశీలన

చిట్యాల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీంద్ర నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో పేషెంట్స్‌తో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సదుపాయాల గురించి తెలుసుకున్నారు. వైద్యాధికారి సయ్యద్ అజర్ అహ్మద్‌తో మాట్లాడి ఉద్యోగుల వివరాలు, ఆరోగ్య కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి సత్య నరేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

# నేటి అర్ధరాత్రి నుంచి టోల్ బాదుడు

- ప్రస్తుత చార్జీలకు 5 శాతం అదనం
- ప్రతియేటా పెంచుతున్న ఎన్‌ఎచ్‌ఏఐ
- ధరల భారంపై మండిపడుతున్న వాహనదారులు

చౌటుప్పల్, మే 31 : నేటి అర్ధరాత్రి నుంచి వాహనదారులపై టోల్ బాదుడు ప్రారంభం కానుంది. జాతీయ రహదారులపై ప్రయాణించే వారి జేబులు ఖాళీ కానున్నాయి. జూన్ 2 నుంచి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌ఎచ్‌ఏఐ) టోల్‌ప్లాజా వద్ద చార్జీలు పెంచిన విషయం తెలిసిందే. ప్రతియేటా ఏప్రిల్ 1న చార్జీలు పెంచుతారు. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. పెంపును వాయి దా వేయాలని ఎన్నికల సంఘం ఎన్‌హెచ్‌ఏఐను ఆదేశించింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా ఏడు విడుతల్లో ఎన్నికలు నిర్వహించారు. జూన్ 1న ఎన్నికల ముగింపునకు తెరపడనుంది. దాంతో అదే రోజు అర్ధరాత్రి నుంచి టోల్ పెరిగిన ధరలు అమల్లోకి రానున్నాయి. టోల్ చార్జీల పెరుగుదల ప్రస్తుత ధరల్లో 5శాతం వరకు ఉంటుంది. కానీ కొన్ని చోట్ల కాంట్రా క్ట్ సంస్థ ఒప్పందం ప్రకారం సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో చేయలేదని పలు విమర్శలు గుప్పుమంటున్నాయి. ప్రధానంగా ఈ సమస్య చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో నెలకొంది. ఈ నేపథ్యంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక వాహనదారులు వాపోతున్నారు. అక్కడక్కడ సిగ్నల్స్ వద్ద లైటింగ్ సమస్య కూడా ఉందని పలువురు చెబుతున్నారు. ప్రతిసారి ధరలు పెంచడం భారంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. పెరుగుదలపై ఉన్న శ్రద్ధ పెండెంగ్ పనులు పూర్తి చేయడంలో లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.





పంతంగి టోల్‌ప్లాజా

# నోట్ బుక్స్ వచ్చేశాయ్..

రామగిరి, మే 31 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచితంగా అందించే నోట్‌బుక్స్ జిల్లా పుస్తక విభాగానికి చేరుకున్నాయి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వాటిని మండల కేంద్రాల్లోని ఎంఆర్‌సీలకు ప్రత్యేక వాహనాల్లో తరలించే పనిని శుక్రవారం ప్రారంభించారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 1,485 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతోపాటు వైట్, సింగిల్ రూల్ నోట్ బుక్స్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. పాఠశాల ప్రారంభం రోజు జూన్ 12న వీటిని అందిం చనున్నారు. ఇప్పటికే ఆయా పాఠశాలలకు తొలి విడుతలో పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తయ్యింది. ఇప్పుడు నోట్ బుక్స్‌తోపాటు రెండో విడుత పాఠ్య పుస్తకాలు సైతం సరఫరా చేస్తున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 4,06,178 వైట్ నోట్ బుక్స్ అవసరం ఉండగా ఇప్పటి వరకు 2,80,900.. సింగిల్ రూల్ నోట్ బుక్స్ 81,815 అవసరం ఉండగా 37 వేలు వచ్చాయని అధికారులు తెలిపారు. మిగిలినవి రెండో విడుతలో రానున్నట్లు వెల్లడించారు.



మండలాలకు వెళ్లే వాహనంలో పుస్తకాలు లోడ్ చేస్తున్న హమాలీలు




# దంచికొడుతున్న ఎండలు

## ఉమ్మడి జిల్లాలో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

- వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- ఉదయం 10:30 గంటలకే 38 నుంచి 40 డిగ్రీలు..
- మరింత పెరగనున్న ఉష్ణోగ్రతలు.. జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

సూర్యాపేట, మే 31 (నమస్తే తెలంగాణ) : ఎండలు భగభగ మండుతున్నాయి. వర్షాలతో కొన్ని రోజులు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించినా మళ్లీ భానుడు విజృంభిస్తున్నాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో అత్యధికంగా 46.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో 46.4, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో 46.3 డిగ్రీలు రికార్డయ్యింది. ఉదయం పదిన్నర గంటలకే 38 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. మధ్యాహ్నం అయితే ఎండ తీవ్రతతో పాటు వడగాలులు జనాలను బయటకు అడుగు పెట్టనివ్వడం లేదు. సాయంత్రం అయినా వేడిమి తగ్గడం లేదు. జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏసీలు, కూలర్లను ఆశ్రయిస్తున్నారు. కొబ్బరిబొండాలు, శీతలపానీయాలు, నిమ్మ సోడాలకు గిరాకీ పెరిగింది. పెరిగిన ఎండలతో కూలీలు, రైతులకు, చిరు వ్యాపారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని, ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరో ఐదారు రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.



ఎండ తీవ్రత వల్ల ఖాళీగా కనిపిస్తున్న సూర్యాపేటలోని విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి

### ఉష్ణోగ్రతలు ఇలా..

యాదాద్రి జిల్లా వలిగొండలో 46.3, యాదగిరిగుట్టలో 45.9 డిగ్రీలు, మోత్కూరు బుజిలాపురంలో 44.3, ఆలేరు గొలనుకొండలో 44.2, మోటకొండూరులో 43.8, సంస్థాన్‌నారాయణపురం జనగాంలో 43.6, చౌటుప్పల్ తూప్రాన్‌పేటలో 43, అడ్డగూడూరు, భువనగిరి నందనం, గుండాలలో 42.7, భూదాన్‌పోచంపల్లి జలాల్‌పురంలో 42.6, ఆత్మకూరు (ఎం)లో 42.5, రామన్నపేట ఎల్లంకిలో 42.3, బీబీనగర్ వెంకిర్యాల, బొమ్మలరామారం మర్యాలలో 42.2, రాజాపేటలో 42, తుర్కపల్లి(ఎం)లో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తొగర్రాయిలో 46.4, పెన్‌పహాడ్, చిలుకూరు మండలాల్లో 46.1, మఠంపల్లిలో 45.9, మోతె 45.2, అనంతగిరి 45.1, నడిగూడెం 45, సూర్యాపేటలో 44.2 డిగ్రీలు రికార్డు కాగా.. నల్లగొండ జిల్లా కేతేపల్లిలో 46.8, మిగతా మండలాల్లో 40 డిగ్రీలకు తక్కువ ఎక్కడా నమోదు కాలేదు.




నల్లగొండలో ఎండకు తాళలేక రుమాలు కట్టుకొని వెళ్తున్న యువకులు

# యాదాద్రి పవర్‌ప్లాంటులో చోరీ కలకలం

- పర్యవేక్షణ లోపమా.. నిఘా వైఫల్యమా?

దామరచర్ల, మే 31 : మండలంలోని వీర్లపాలెం, వీరప్పగూడెం గ్రామాల మధ్య చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్‌లో వరుస దొంగతనాలు కలకలం రేపుతున్నాయి. వారం రోజుల క్రితం పవర్‌ప్లాంట్ నుంచి కోట్ల రూపాయల విలువ చేసే స్క్రాప్, విలువైన సామగ్రిని తరలించారని పోలీసులకు సమాచారం అందడంతో వాడపల్లి, మిర్యాలగూడ పోలీసులు రంగంలోకి దిగి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. చోరీ చేసిన సామగ్రి అమ్మకంలో తేడాలు రావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. మిర్యాలగూడ, దామరచర్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి నిత్యం ఇదే పనిని కొనసాగిస్తూ లక్షల రూపాయలను ఆర్జించారు. గత ప్రభుత్వం 35 వేల కోట్ల రూపాయలతో థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టి బీహెచ్‌ఈఎల్‌కు పనులకు అప్పగించింది. నిర్మాణానికి కావాల్సిన సామగ్రిని ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది టన్నుల సామగ్రిని బీహెచ్‌ఈఎల్ ప్లాంట్‌లో, ప్లాంట్ ఆరు బయట దిగుమతి చేసుకొని డంప్ చేసింది. దీన్ని ఆసరాగా చేసుకొని చిన్నచిన్న దొంగలతో పాటు బడాబాబులు సైతం కొన్నేండ్లుగా ఈ దందా కొనసాగిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తున్నారు. రాత్రి సమయాల్లో ప్లాంట్‌లోని స్క్రాప్‌తో పాటు ఇనుము, అల్యూమినియం, రాగి, ఇత్తడి విలువైన సామగ్రిని డీసీఎం, ట్రాక్టర్లపై నేరుగా మిర్యాలగూడ, హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు తెలిసింది. ప్లాంట్‌లో గతంలో పలు మార్లు దొంగతనాల జరిగినప్పటికీ విషయాలు బయటకు పొక్కనివ్వలేదని సమాచారం. దాంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గతేడాది ప్లాంట్ భద్రత ఏర్పాట్లను ఎస్‌పీఎఫ్‌కు అప్పగించారు. ప్లాంట్ చుట్టూ వాచ్ టవర్లు ఏర్పాటు చేశారు. నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. నిత్యం నిఘా పటిష్టంగా ఉన్నప్పటికీ ఇలాంటి సంఘటనలు జరుగడం పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ప్లాంట్‌లో కొంత మంది అధికారుల సహకారంతోనే ఈ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా దొంగతనాలపై పూర్తి స్థాయి విచారణ జరిపితే అసలు నిజాలు నిగ్గుతేలే అవకాశం ఉంది. వారం రోజుల క్రితం జరిగిన చోరీపై జిల్లా ఎస్పీ పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది.




యాదాద్రి పవర్‌ప్లాంట్ ముందు డంప్ చేసిన సామగ్రి

### బీహెచ్‌ఈఎల్ చూసుకుంటుంది : సమ్మయ్య, ప్లాంటు సీఈ

ప్లాంట్‌లో ఎలాంటి దొంగతనాలు జరుగలేదు. ప్లాంట్ బయట వేలాది టన్నుల సామగ్రి ఉన్నది. అందులోని సామగ్రి చోరీకి గురవుతున్నట్లు తెలిసింది. దీనిపై జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదు. ప్లాంట్ నిర్మాణం పూర్తిగా బీహెచ్‌ఈఎల్‌కు అప్పగించాం. జరిగిన దొంగతనాలకు బీహెచ్‌ఈఎల్ చూసుకుంటుంది.

# నల్లమలలో జంతు సందడి

- 436కు చేరిన వివిధ రకాల జంతువుల సంఖ్య
- ట్రాప్ కెమెరాలో చిక్కిన చిరుత, మనుబోతు, దుప్పి తదితరాలు



చందంపేట, మే 31 : నల్లమల అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ జంతువుల సంఖ్య గతం కంటే పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వివిధ రకాల జంతువులు 436 ఉన్నాయని, అందులో సుమారు 12 చిరుతలు ఉండొచ్చని అంచనా వేస్తున్నామని పేర్కొంటున్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జంతు సంరక్షణ చర్యలే దీనికి ప్రధాన కారణం. వేసవిలో జంతువుల దాహార్తిని తీర్చేందుకు సాసర్ పిట్స్ ఏర్పాటు చేయడం, వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ట్యాంకర్ ద్వారా ఎప్పటికప్పుడు తాగునీటిని అందించడం వంటివి జంతువులు పెరుగడానికి ఎంతో దోహదపడ్డాయని చెప్పొచ్చు.

### కొత్త జంతువుల గుర్తింపు

చందంపేట, నేరేడుగొమ్ము మండలాల్లోని నల్లమల అటవీ పరిధిలో పాలపేడ, ఎర్రపేడ, భూదేవిపెంట, చాకలిచెరువు, దయ్యాలగుట్ట, దాసర్లపల్లి, బచ్చాపురం, కాచరాజుపల్లి తదితర ప్రాంతాల్లో సుమారు 78 ట్రాప్ కెమెరాలు, 46 సాసర్స్ పిట్స్(నీటి తొట్టిలు) ఏర్పాటు చేశారు. 26వేల హెక్టార్ల అటవీ ప్రాంతంలో వివిధ రకాల మొక్కలు సైతం నాటారు. ఇక్కడికి అమ్రాబాద్ రిజర్వ్‌డ్ టైగర్ జోన్ దగ్గర ఉండడంతో ఆ ప్రాంతంలోని జంతువులు సైతం దాహార్తిని తీర్చుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. కెమెరా ట్రాప్‌లో కొత్త కొత్త జంతువులను గుర్తించినట్లు ఎఫ్‌డీఓ సర్వేశ్వర్ తెలిపారు. ఇందులో జింకలు, మనుబోతులు, దుప్పిలు, చిరుత, నెమలి, అటవీ పందులు, అటవీ కోళ్లు, ముళ్ల పందులు, అటవీ కుక్కలు, నక్కలతో పాటు మరికొన్ని రకాల జంతువులు ఉన్నట్లు చెప్పారు. నల్లమల అటవీ ప్రాంతంలో నిరంతర గస్తీ ఉంటుందని, బీట్ ఆఫీసర్లు వాచ్ టవర్ ద్వారా ఇతరులు రాకుండా పర్యవేక్షిస్తారని సర్వేశ్వర్ తెలిపారు.





నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అటవీ జంతువులు(ఫైల్)

# నేటి నుంచి బీఆర్‌ఎస్ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు

- నేడు, రేపు రాజధాని కేంద్రంగా కార్యక్రమాలు
- రేపు జిల్లాల్లోనూ సేవా కార్యక్రమాలు
- ఎల్లుండి పార్టీ జిల్లా కార్యాలయాల్లో ముగింపు వేడుకలు
- రేపు ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో ఉత్సవాలు




నల్లగొండ ప్రతినిధి, మే31(నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు బీఆర్‌ఎస్ పార్టీ సన్నద్ధమైంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు నేటి నుంచి మూడు రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. నేడు, రేపు హైదరాబాద్‌లో, ఎల్లుండి జిల్లాల్లో కార్యక్రమాల నిర్వహణకు పార్టీ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద గల అమరజ్యోతి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమరులకు ఘనంగా నివాళులర్పించనున్నారు. ఇక ఆదివారం దశాబ్ద కాలం గడుస్తున్న నేపథ్యంలో ముగింపు వేడుకల పేరుతో పార్టీ కేంద్ర కార్యాలయంలో సభ కేసీఆర్ అధ్యక్షతన జరుగనుంది. ఇదే సమయంలో జిల్లాల్లోనూ ప్రభుత్వ ఆస్పత్రులు, అనాథ శరణాలయాలు, పలు సంస్థల్లో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పండ్లు, స్వీట్ల పంపిణీతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 3వ తేదీన అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో ముగింపు ఉత్సవాలను నిర్వహించనున్నారు. దీనికి జిల్లా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాల ఆవరణలో జాతీయ పతాకంతో పాటు పార్టీ పతకాన్ని కూడా ఎగురవేసేలా కార్యాచరణ ప్రకటించారు.

### రేపు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో..

జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో రేపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఆదివారం ఉదయం 9గంటలకు పరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు.

అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులర్పించనున్నారు. శనివారం సాయంత్రమే కలెక్టర్, మున్సిపల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను లైటింగ్‌తో అలకరించేందుకు ఆదేశాలిచ్చారు. రేపటి అవతరణ వేడుకల ఏర్పాట్లపై నల్లగొండ కలెక్టర్ హరిచందన శుక్రవారం సమీక్ష నిర్వహించి తగిన ఆదేశాలిచ్చారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

# రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

- రాజముద్ర నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగింపు సరికాదు
- బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

దేవరకొండరూరల్(దేవరకొండ)మే31 : బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యుడు రమావత్‌రవీంద్రకుమార్ కోరారు. దేవరకొండలోని తన నివాసంలో శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. జూన్1, 2, 3 తేదీల్లో 3 రోజులపాటు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు మొండిగా వ్యవహరిస్తున్నదని, గత పదేండ్లలో జరిగిన మంచిని, అభివృద్ధిని పట్టించు కోకుండా, రాజకీయ దురుద్దేశంతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ మూర్ఖపు నిర్ణయాలు తీసుకుంటున్నదని, తెలంగాణ అనగానే హైదరాబాద్, వరంగల్ గుర్తుకొస్తాయని, రాష్ట్ర రాజముద్ర నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పూర్తిగా ఖండిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు కూడా దీనిని తీవ్రంగా వ్యతిరేకిసున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.